క్లుప్తంగా

ఘనంగా రాష్ట్రీయ ఏక్తా దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో రాష్ట్రీయ ఏక్తా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశం కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలను కొనియాడారు. ఇదిలా ఉండగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ దయాకర్ ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఏక్తా ప్రతిజ్ఞ చేయించారు. లెక్చరర్లు, అష్రఫ్ అలీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమానికి కృషి చేసే పార్టీకే మద్దతు'

ఎదులాపురం: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేసే పార్టీకే మద్దతు తెలుపుతామని దివ్యాంగుల వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు బొనే నగేశ్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగులు, వారి కుటుంబాలు కలుపుకుని జిల్లా వ్యాప్తంగా దాదాపు 26,583 ఓట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. తమ సంక్షేమానికి కృషి చేసే రాజకీయ పార్టీల నాయకులకు మద్దతిస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సిడ్కే సంతోశ్, ఉపాధ్యక్షుడు మోహన్, సలహాదారులు ప్రమోద్‌కుమార్, చంద్రశేఖర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ అందించాలని నిరసన



నిరసన తెలుపుతున్న సంఘ నాయకులు

ఉట్నూర్‌రూరల్:నాయీబ్రాహ్మణుల దుకాణాలకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని మంగళవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట సంఘం డివిజన్ అధ్యక్షుడు గర్షకుర్తి వెంకటేశ్, నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదారునెలలు మాత్రమే ఉచిత విద్యుత్ అందించి ఆపై ఇవ్వడం లేదన్నారు. దీంతో ఒక్కొక్కరి బిల్లులు రూ.13 వేలకు చేరిందన్నారు. బిల్లులు చెల్లించాలని అధికారులు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై విద్యుత్ శాఖ డీఈ సుభాష్‌ని వివరణ కోరగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మండల కార్యదర్శి ఆర్‌కే ప్రవీణ్, సభ్యులు ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడు నగేశ్, రాజేందర్, శ్రీనివాస్, మహేశ్, నారాయణ, మారుతి పాల్గొన్నారు.

కుమురం భీం వర్ధంతి



నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మలో కుమురం భీం వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ నాయకులు భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక సర్పంచ్ గుండాల లక్ష్మి, గ్రామాల సర్పంచులు, పటేళ్లు పాల్గొన్నారు.
బేల: మండలంలోని టాక్లీ గ్రామంలో ప్రధాన వీధులగుండా డోల్ వాయిద్యాలతో ఆదివాసీలు ర్యాలీ నిర్వహించారు. తర్వాత భీం చిత్రపటానికి పూలమాలలు వేశారు. గ్రామపటేల్ గోద్రుపటేల్, నాయకులు పాల్గొన్నారు.

నిందితుల కోసం గాలింపు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని భీంజీగూడకు చెందిన బాలికను హత్య చేసిన నిందితులను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఉట్నూర్ సీఐ రామకృష్ణ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్, ఆదిలాబాద్ రూరల్ సీఐలు మూడు బృందాలుగా ఏర్పడి మంగళవారం గాలింపు చర్యలు చేపట్టారు. చుట్టు పక్కల గ్రామాల్లో తిరుగుతూ విచారణ చేపడుతున్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయా పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ప్రచార రథాల ద్వారా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. మంగళవారం టూటౌన్ పోలీసు స్టేషన్ వద్ద పార్టీల ప్రచార రథ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమించి లౌడ్‌స్పీకర్ల ద్వారా అధిక శబ్దం చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

బంతి సిరులు

- పండుగల నేపథ్యంలో పూలకు పెరిగిన డిమాండ్
- మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి 60 ధర
- లాభాలు గడిస్తున్న పలువురు రైతులు



పూలను కోస్తున్న రైతులు



పొన్నారిలో సాగు చేసిన బంతి

తాంసి: జిల్లాలో ఈ ఏడాది బంతి సాగు సిరులు కురిపిస్తోంది. వరుస పండుగల నేపథ్యంలో పూలకు డిమాండ్ పెరిగింది. బతుకమ్మ, దసరా వేడుకలు, శుభకార్యాల కోసం పూలకు బహిరంగ మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వాణిజ్య పంటలకు స్వస్తి పలికి ఈసారి బంతి సాగుకు మొగ్గుచూపారు. అర ఎకరం, ఎకరాల్లో సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. స్థానికంగా మార్కెట్‌లో వీటిని విక్రయించి ఆదాయం పొందుతున్నారు.

పూల వినియోగం అధికం

బంతితోపాటు ఇతర పూలకు ఈ సీజన్‌లో డిమాండ్ ఉంది. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు బంతిపూల వినియోగం అధికంగా ఉంటుంది. దసరా నుంచి మొదలుకొని బతుకమ్మ, దీపావళి పండుగలు, కార్తీకమాసం, లక్ష్మీపూజలు అధికంగా ఉంటాయి. వీటి కోసం పూల వినియోగం ఎక్కువగా ఉంటుంది. సీజన్‌కు తగ్గట్టుగా వివిధ పూలు సాగు చేయడంతో నిత్యం రైతులకు ఆదాయం వస్తోంది. పండుగలతోపాటు బతుకమ్మ వేడుకల కోసం చేల వద్దకే వచ్చి చాలామంది పూలను తీసుకెళ్తున్నారు. పొన్నారి గ్రామ రైతులు సాగుచేసిన పూలను ఆ ఊరిలోనే విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు.

ఆశాజనకంగా దిగుబడులు

వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా సాగుచేసిన బంతిసాగు దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. తాంసి మండలం పొన్నారి, ఇచ్చోడ, బరంపూర్, అర్లి, అంకోలి, తంతోలి, కుచులాపూర్ తదితర గ్రామాల్లో రైతులు బంతి సాగు చేస్తున్నారు. పంటకు అనుకూలంగా వర్షాలు కురవడంతోపాటు పురుగు ఉధృతి అంతగా లేదు. బంతి ఎకరాకు 4 నుంచి 5 టన్నుల దిగుబడి వచ్చే ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరా సాగుకు రూ.25 వేలు ఖర్చవుతుందని అంటున్నారు. మార్కెట్‌లో బంతి కిలో ప్రస్తుతం రూ.50 నుంచి రూ.60 వరకు పలుకుతుంది. ఎకరంలో అన్ని ఖర్చు పోను రైతుకు రూ.లక్ష ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

అర ఎకరంలో సాగు చేశా



కొన్నేళ్లుగా బంతితోపాటు ఇతర కూరగాయలు సాగు చేస్తున్నా. అర ఎకరంలో బంతి సాగుచేశా. ప్రస్తుతం పూలు వస్తున్నాయి. రెండు రోజులకోసారి పూలను కోస్తున్నాం. ప్రతిసారి 2 నుంచి 3 క్వింటాళ్లకు పైగా వెళ్తున్నాయి. కిలో రూ.50కి విక్రయిస్తున్నా. పూలసాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీ ద్వారా విత్తనాలు, ఎరువులు అందించాలి.
– దాసరి స్వామి, రైతు, పొన్నారి

దిగుబడి వస్తుంది



ఈ ఏడాది బంతిపూల సాగు ఆశాజనకంగా ఉంది. ఎకరంలో పంట దిగుబడి బాగా వస్తుంది. ఇప్పటికే పంట నాలుగు టన్నుల వరకు దిగుబడి వచ్చింది. పూలను నేరుగా మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తున్నాను. ప్రతీరోజు ఆదాయం సమకూరుతుంది. బంతి పూల సాగుతో లాభాలు రావడంతో సంతోషంగా ఉంది.
– దేవిదాస్, రైతు, పొన్నారి

'బీజేపీతోనే అభివృద్ధి'



మహిళలతో మాట్లాడుతున్న పాయల్ శంకర్

జైనథ్: తెలంగాణలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పిప్పర్‌వాడలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జోగు రామన్న ఆదిలాబాద్ నియోజకవర్గానికి చేసింది శూన్యమన్నారు. డబుల్ బెడ్రూంలు కట్టిస్తామని ఎమ్మెల్యే గత ఎన్నికల్లో హామీ ఏమైందని ప్రశ్నించారు. తనకు ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు కట్కం రాందాస్, నాయకులు రతన్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రమేష్, మయూర్ చంద్ర, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్: నియోజకవర్గ అభివృద్ధిని ఎమ్మెల్యే జోగు రామన్న విస్మరించారని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ కాలనీలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం పాల్గొన్నారు. కౌన్సిలర్లు రఘుపతి, రాజేష్, నాయకులు దినేష్ మతోలియా, లాలామున్నా పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటా ప్రచారం



గిన్నేరలో ప్రచారం చేస్తున్న కార్యకర్తలు

ఇంద్రవెల్లి: మండలంలోని బిక్కుతండా, గిన్నేర, మర్కగూడ, తోయగూడ, బొప్పపూర్ గ్రామాల్లో బీజేపీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. ఈసారి కమలం పువ్వు గుర్తుకు ఓటేసి రాథోడ్ రమేశ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. పార్టీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు, మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, కార్యకర్తలు సోయం వినోద్, పెందోర్ గణేశ్, రాథోడ్ భీంరావ్, మస్కే రాజువర్ధన్, మోరే దిలీప్, సంతోష్ తదితరులు ఉన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు



నేరడిగొండ: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

నేరడిగొండ/గుడిహత్నూర్/బోథ్: ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నేరడిగొండ, గుడిహత్నూర్, బోథ్ మండలాల్లో నాయకులు ఏఐటీయూసీ జెండాలను ఎగురవేశారు. కార్మికుల కోసం ఏఐటీయూసీ పోరాడుతుందన్నారు. నాయకులు గోవర్ధన్, గోదావరి, గంగాధరి గంగన్న, బాబు, రాజేందర్, రమేశ్, ఉస్మాన్, కృష్ణ, మోహితే మారుతి పాల్గొన్నారు.

కప్పర్లలో నిరసన సెగ

- బీఆర్ఎస్ ప్రచారాన్ని అడ్డుకున్న గ్రామస్తులు
- గ్రామంలో అభివృద్ధి జరగలేదని నిలదీత



నాయకులను నిలదీస్తున్న గ్రామస్తులు

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో బీఆర్ఎస్ నాయకులకు నిరసన సెగ తగిలింది. పార్టీ నాయకుల ఎన్నికల ప్రచారాన్ని గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్‌గా మద్దతుగా జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ అరుణ్, నాయకులు ప్రచారం చేస్తుండగా, గ్రామంలో తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధి ఏదంటూ నిలదీశారు. డబుల్ బెడ్రూం ఇస్తామని నేటికి ఇవ్వలేదని, ఇళ్ల నిర్మాణం ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. గ్రామానికి వచ్చే రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నా ప్రచారానికి ఎందుకు వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల అనంతరం ఇళ్లు, రోడ్డు నిర్మాణం పూర్తి చేయిస్తామని నాయకులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

బీఆర్ఎస్‌దే హ్యాట్రిక్ విజయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్



హీరపూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. మండలంలోని గోపాల్‌పూర్, మారుతిడూగ, హీరపూర్, లక్ష్మీపూర్, అంద్‌గూడ, రాంజీగూడ, పాటగూడ, బండపాటగూడ, అంజీ గ్రామాల్లో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఎజిద్, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, మండల కోఆప్షన్ సభ్యుడు మీర్జా జీలానిబేగ్, ఎంపీటీసీలు కోవ రాజేశ్వర్, మడావి భీంరావ్, నాయకులు షేక్ సుఫీయన్, విజయ, సుంకట్‌రావ్, తుకారం, హనుమంత్‌రావ్ ఉన్నారు.

'దళారీలా రేవంత్‌రెడ్డి'



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: రైతుబంధు నగదు నిలిపివేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈసీకి ఫిర్యాదు చేయడం రైతుల పట్ల ఆ పార్టీకి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలం చిట్యాల్‌బోరి గ్రామం నుంచి ప్రారంభమైన ఎన్నికల ప్రచారం అంకోలి, వాన్వాట్ గ్రామాల్లో మంగళవారం కొనసాగింది. ఎమ్మెల్యేకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థుల నుంచి టికెట్ల కోసం కోట్ల రూపాయలను వసూలు చేస్తూ రేవంత్ రెడ్డి దళారీలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకే గ్యారంటీ లేనపుడు వారి పథకాలకు గ్యారంటీ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఎంపీపీ గంద్రత్ రమేశ్, వైస్ ఎంపీపీ జంగు పటేల్, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, మార్కెట్ కమిటి చైర్మన్ కుమ్ర లక్ష్మి రాజు, వైస్ చైర్మన్ బొమ్మకంటి రమేశ్, కుమ్ర లక్ష్మి వసంత్, ఆత్మచైర్మన్ జిట్ట రమేశ్, నాయకులు సేవ్వ జగదీశ్, రమణ, సుదర్శన్, ఆరే నరేశ్ పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా

- కాంగ్రెస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్



ర్యాలీలో పాల్గొన్న వన్నెల అశోక్

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలకు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వన్నెల అశోక్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా నుంచి మండల కేంద్రం వరకు కార్యకర్తలతో కలిసి మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. తొమ్మిదిన్నరేళ్లలో అధికార పార్టీ ఏం చేసిందో ప్రజలు గమనించాలన్నారు. హస్తం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం బోథ్ వరకు బైక్ ర్యాలీ సాగింది. నాయకులు ఎరడ్ల చంద్రశేఖర్, రాంలక్ష్మణ్‌గౌడ్, గడ్డం నరేశ్‌రెడ్డి, రాములు, కొప్పుల ఊశన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికే ప్రజల ఓటు



కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్న నారాయణ

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం చేసిన అభివృద్ధికే ప్రజలు ఓటు వేస్తారని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని దుర్గానగర్‌లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేపట్టారు. కారు గుర్తుకు ఓటేసి జోగు రామన్నను ఎమ్మెల్యేగా అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు అజయ్, వినోద్, భగవాండ్లు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్‌లో..

పట్టణంలోని బాలాజీనగర్‌లో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పాల్గొని ఇంటింటా తిరుగుతూ పార్టీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. జోగు రామన్నను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. నాయకులు ఉదయ్‌కుమార్, దాసరి రమేశ్, మధు, నరేందర్, నరహరి, స్వామి, నరేశ్, రాహుల్, సాయి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి'



బెల్లూరిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుల

గుడిహత్నూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మూడోసారి పార్టీని గెలిపిస్తాయని సర్పంచుల సంఘం అధ్యక్షుడు తిరుమల్ గౌడ్ అన్నారు. మండలంలోని శాంతాపూర్, గోండ్ హర్కాపూర్, బెల్లూరి గ్రామాల్లో మంగళవారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ ముండే సంజీవ్, సర్పంచ్ కుమ్ర శంభు ఉన్నారు.

పల్లెల్లో ప్రచారం

సిరికొండ/నేరడిగొండ: సిరికొండ మండలంలోని రాయిగూడ, సుంకిడి, కోసుగూడ పటేల్, నేరడిగొండ మండలం శంకరాపూర్, కిష్టాపూర్, రోల్‌మామడ, దేవుల్‌నాయక్‌తండా, బోరిగాం గ్రామాల్లో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పెంట వెంకటరమణ, ఆ పార్టీ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, రాయిగూడ, పోన్న, సుంకిడి సర్పంచులు లక్ష్మి, చంద్రకళ, జాదవ్ అనిత బాయి పాల్గొన్నారు.
బోథ్: బోథ్‌లో ఎంపీపీ శ్రీనివాస్ చాయ్ ఇస్తూ బీఆర్ఎఫ్ ఓటేయాలని అభ్యర్థించారు.
ఉట్నూర్‌రూరల్: బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని కోరుతూ సాలెవాడలో నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ బాలాజీ, మండల అధ్యక్షుడు రమేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, సింగారే భరత్ ఉన్నారు.

వైద్యాధికారులకు సన్మానం



సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: కుష్ఠు, క్షయ నివారణ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ మెట్‌పెల్లివార్ శ్రీకాంత్, అంకోలి పీహెచ్‌సీ వైద్యాధికారి రాహుల్‌ను డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ సన్మానించారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ సమావేశ మందిరంలో తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీ ఉన్నత కోర్సులు చదివేందుకు వెళ్తున్న ఇద్దరు అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించినట్లు తెలిపారు. పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మెట్‌పెల్లివార్ శ్రీధర్, వైద్యాధికారులు విజయ్, వంశీ, శ్రీకాంత్, శ్యామ్, ప్రవీణ్, సుచల, శ్రావ్యవాణి, ఇఫత్, కిరణ్, సందీప్, హరీశ్, హిమబిందు, బండారి కృష్ణ పాల్గొన్నారు.

కుమ్ములాటల పార్టీలను ప్రజలు విశ్వసించరు

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: సీఎం అభ్యర్థులెవరో కూడా స్పష్టత లేని కుమ్ములాటల కాంగ్రెస్, బీజేపీ పార్టీలను ప్రజలు విశ్వసించరని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పట్టణంలోని రణదీవే నగర్ కాలనీలో ఆయన పర్యటించారు. కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ మేనిఫెస్టోను, ప్రభుత్వ పథకాల తీరును వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హామీలు అమలు చేస్తుందన్న నమ్మకం ప్రజల్లో లేదన్నారు. బీజేపీ ఇప్పటివరకు మేనిఫెస్టో ప్రకటించలేని పరిస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్న బీఆర్ఎస్ కారు గుర్తుకు మరోసారి ఓటు వేసి ఎమ్మెల్యే జోగు రామన్నను గెలిపించాలని కోరారు. కౌన్సిలర్ కోవ రవి నాయకులు కొండా గణేష్ , పర్వీన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అశోక్‌కే మద్దతు

తలమడుగు: కాంగ్రెస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి వన్నెల అశోక్‌కు మద్దతు ఇస్తామని చర్లపల్లి ఆదివాసీ గిరిజనులు తెలిపారు. మండలంలోని జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి నివాసంలో మంగళవారం గ్రామస్తులు కలిసి మద్దతు ప్రకటించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ, పిప్పల్‌ధరి, అంకోలి సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతు కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయ కలుగుతుందని ఏఈ తిరుపతిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

గొర్రెలు, మేకలకు టీకా

తలమడుగు: గ్రామాల్లో నిర్వహించే పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి దుద్‌రామ్ రాథోడ్ అన్నారు. మండలంలోని కజ్జర్ల గ్రామంలో మంగళవారం గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకా వేశారు. సిబ్బంది సౌమ్య. అశన్న. తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సోషల్ మీడియా జాయింట్ కన్వీనర్‌గా రాజశేఖర్

నేరడిగొండ: బీజేపీ బోథ్ నియోజకవర్గ సోషల్ మీడియా జాయింట్ కన్వీనర్‌గా కుప్టి గ్రామానికి చెందిన ఆకుల రాజశేఖర్‌ను నియమించారు. ఆదిలాబాద్ ఎంపీ, బోథ్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు మంగళవారం ఆయనకు నియామకపత్రం అందజేసి శాలువతో సత్కరించారు. బీజేపీ ఐటీ, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ సాయితేజ ఉన్నారు.

జాతీయ సమైక్యత దినోత్సవం

బోథ్: జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్థానిక వాగ్దేవి కళాశాలలో మంగళవారం జాతీయ సమైక్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో బోథ్ సీఐ భీమేశ్, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

బోథ్: ఎన్నికలవేళ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి సాహదు బాజీపై అన్నారు. మండల కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో తహసీల్దార్, అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు.

'లోక్ అదాలత్' విజయవంతం చేయండి

బోథ్: డిసెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని బోథ్ జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ బి.హుస్సేన్ కోరారు. కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా సహకరించాలన్నారు.